# నాలుగో అధ్యాయం

# గోగినేని మణి రచనలు – శిల్పం

# 4. గోగినేని మణి రచనలు - శిల్పం

## ఉపోద్ఘాతం

ఆధునిక సాహిత్య ప్రక్రియల్లో తొలినాళ్ళ నుంచి నేటి వరకు ఆధునిక సామాజిక జీవన వాస్తవికతను సమర్ధవంతంగా ప్రతి ఫలింపజేసినవి కథలు, నవలలు. అందుకే ఈ ప్రక్రియలు నేటి వరకు చిరస్థాయిగా తెలుగు సాహిత్యచరిత్రలో నిలబడగలిగాయి. శతాధికంగా కథలను, నవలలను పుంఖానుపుంఖాలుగా అనేక మంది రచయితలు రాస్తూనే ఉన్నారు. అటువంటి రచనల్లో రచనాశిల్పం ఉండటం వల్ల అవి పాఠకులను ఆకర్షించటంతో ఆ రచనలకు ప్రాధాన్యత కలుగుతుంది. రచయిత తన భావాలను తన రచనలో ప్రవేశపెట్టి సమాజానికి ఒక విధమైన సందేశాన్ని అందించగలుగుతాడు. తద్వారా ఆ రచయిత లేదా ఆ రచన బహుజన పాఠకాదరణ పొందడమేకాక సమాజాన్ని సంస్కరింపచేసేదిగానో, సమాజాన్ని ఆలోచింపచేసేదిగానో ఉంటుంది.

"ఆధునిక తెలుగు సాహిత్యంలో 'Technique" అన్న ఆంగ్ల పదానికి సమానార్ధకంగా "శిల్పం" అన్న మాట వాడుకలో ఉంది. ఆధునిక రచయితలు, విమర్శకులు శిల్పం అన్న మాటను ఒక నిర్ధుష్టమైన అర్ధంలో కాక స్వేచ్ఛగా ఉపయోగిస్తున్నారు. "ఏదైనా కళా నైపుణ్యం చూపే పద్ధతిని శిల్పమనవచ్చు" అని చెబుతూ సాహిత్య ప్రక్రియలోని వస్తువును పాత్ర చిత్రణ, సంభాషణ, సంఘర్షణ, సన్నివేశం, కథాకథనం, శీర్షిక మొదలైన అంశాల కల్పనలోను, చిత్రణలోను, ప్రదర్శించే కళానైపుణ్యాతే శిల్పంగా రూపొందుతుందని చెప్పవచ్చు"[1].

రచయిత సాధారణంగా తన జీవిత అనుభవాన్ని, తాను విన్నవాటిని, కన్నవాటిని లేదా సమాజాన్ని నిశితంగా పరిశీలించడం గాని తను అనుకున్న ఊహలు, కల్పనల ద్వారా సృజనచేసేదే రచన. దీనికి శిల్పం అవసరం. శిల్పం లేకపోతే ఆ కథకు ఆకారం చెడిపోతుంది. "రచయిత భావాలకు రూపకల్పన రచన అయినప్పుడు, దానిని సంపూర్ణమైన కళాఖండంగా తయారు చేయడానికి రచయిత ప్రదర్శించే నేర్పు, ప్రతిభా, చాకచక్యం వాటిన్నిటి సామూహిక స్వరూపాన్ని శిల్పం అనవచ్చు"[2].

---

1. కథానిక స్వరూప స్వభావాలు - 4వ అధ్యాయం - పోరంకి దక్షిణామూర్తి

2. బలివాడ కాంతారవు నవలలు - పరిశీలన - ఆచార్య జి. యోహాన్‌బాబు

శిల్పి శిల నుంచి అద్భుతమైన శిల్పాన్ని చెక్కినట్టుగానే రచయిత కూడా తాను తీసుకున్న ముడిసరుకైన వస్తువును లేదా కథను తన కథాకథన సామర్థ్యంతోను, వర్ణనా కౌశలంతో పాత్రచిత్రణ నైపుణ్యంతోను, అన్నింటిని మించిన అనుభవంతోను, తనలోని ప్రతిభ చేతను ఓ కళాఖండంగా తీర్చిదిద్దితే దానినే స్థూలంగా రచనా శిల్పం అనవచ్చు.

కథా వస్తువు రచయిత జీవితంలోంచిగాని లేదా రచయితకు తెలిసిన ఇతరుల జీవితాల్లోంచిగాని పుట్టవచ్చు. కథకు జీవితం ముడిసరుకు. జీవితం నుంచి రచయిత వస్తువును ఎన్నుకోవడంలోను, దాన్ని చిత్రించడంలోను, అతని భావజాలం తప్పక ఉంటుంది. అందుకే సాహిత్యాన్ని చదవడానికి ముందు సాహిత్యకారుణ్ణి చదవటం మంచిది. "సాహిత్యం నుంచి భావజాలాన్ని, రచయిత ఉద్దేశ్యాన్ని అధ్యయనం చేయాలి. అప్పుడు రచయిత యొక్క అసలు ఉద్దేశ్యం అర్థమవుతుంది. ఈ ఉద్దేశ్యాన్ని కళగా మలచేపరుస వేది శిల్పం"[3]

శిల్పానికి సంబంధించిన అంశాలను గూర్చి వివరిస్తూ.... "కథలోని కేంద్రబిందువు కథాంశం. కథాంశానికి, రచయితకు మధ్య ఉన్న సంబంధమే ఉద్దేశ్యం. వీటిలో కథ, కథాంశాలు, ఉద్ధేశ్యం, అనేవి వస్తువులకు సంబంధించిన అంశాలైతే, కథాకథనం, పాత్రలు, నేపథ్యం, దృష్టికోణం, కంఠస్వరం అనేవి శిల్పానికి సంబంధించినవి"[4] అని వల్లంపాటి వెంకటసుబ్బయ్య గారు తన కథాశిల్పంలో వ్యక్తం చేసారు.

రచయిత తన రచనలో పాత్రచిత్రణలోను, వస్తు వైవిధ్యంలోను, కథాకథనంలోను, కంఠస్వరంలోను, భాషాశైలిలోను, శీర్షికా ప్రకటనలోను, ప్రారంభం, ముగింపులోను ఒక నూతన వైవిధ్యాన్ని పాటిస్తే అటువంటి రచయిత సాహిత్యంలో సుస్థిర స్థానాన్ని పొందగలుగుతాడు. 79 కథలు, ఒక నవల రాసిన గోగినేని మణి రచనా శిల్పంలో తనదంటూ ఒక ప్రత్యేకతను ప్రదర్శించారు. వీరి రచనాశిల్పంలో ముఖ్యంగా పాత్రచిత్రణ, సంభాషణలు, శీర్షికా ప్రకటన, కథాకథనం, ప్రారంభం, ఎత్తుగడ, ముగింపు మొదలైన వాటిలో రచనా శిల్పాన్ని ప్రదర్శించి ఆ కథలకు గొప్ప శోభను, గుర్తింపును తెచ్చిపెట్టారు. మొదటగా రచనా శిల్పంలో చెప్పుకోదగ్గది పాత్రచిత్రణ. దీనిని గూర్చి తెలుసుకోవడం ఎంతైనా అవసరం.

**3. నవలా శిల్పం- వల్లంపాటి వెంకట సుబ్బయ్య - పుట 243**

**4. కథా శిల్పం - వల్లంపాటి వెంకట సుబ్బయ్య**

## 4.1 పాత్ర చిత్రణ :

కథ అనే వృక్షానికి ఇతివృత్తం పైరులాంటిది. పాత్రలు ఆ వృక్షానికి కొమ్మలు వంటివి. తల్లి వేరు నుంచి ఇతివృత్త సారంతో పాత్రలు ప్రతిఫలిస్తాయి. పాత్రలు కథకు పట్టుకొమ్మలు. అవి కథకు శోభను సమకూరుస్తాయి. పాత్రలు రచయిత యొక్క దృష్టికోణం నుంచి ఎన్నుకోబడతాయి. కథ ఇతివృత్తాన్ని బట్టి పాత్రలు జనిస్తాయి. రచయిత తాను అనుకున్న లేక తీసుకున్న వస్తువును బట్టి పాత్రచిత్రణ చేస్తాడు. పాత్రల్లో ప్రధానమైన పాత్రలు ఒకటి లేదా రెండు ఉండవచ్చు. కొన్ని కథల్లో రెండు నుంచి నాలుగు పాత్రల వరకు ప్రాధాన్యత నొందిన పాత్రలు ఉండవచ్చు. సాధారణంగా ప్రధాన పాత్రతో మిగిలిన పాత్రలు మమేకమై కథను నడిపిస్తాయి. కొన్ని కథల్లో ఒకే ఒక ప్రధానమైన పాత్ర ఉంటుంది. ఆ ప్రధానమైన పాత్ర చుట్టూ మిగిలిన పాత్రలు సహాయ పాత్రలుగా ఉంటాయి. రచయిత పాత్రలను ఎన్నుకోవడంలోను, పాత్రను సన్నివేశానికి, సందర్భానికి తగ్గట్టుగా చిత్రీకరించడంలోను వైవిధ్యాన్ని ప్రదర్శిస్తాడు. కీలకమైన పాత్రలను సృష్టించడమే రచయిత పనికాదు. ఆ పాత్రలకు తగ్గట్టుగా కథాకథనం, వ్యక్తీకరణ ఉండాలి. అలా ఉన్న కథలే ఉత్తమ కథలుగా నిలుస్తాయి. పాత్రలతో పాటు పాత్రోచితమైన సంభాషణలు ఉండాలి. అందుకే కథల్లో పాత్రలకు అంత ప్రాధాన్యత ఉంటుంది. ఇది రచయిత సృజన మీద, తీసుకున్న ఇతివృత్తం మీద ఆధారపడి ఉంటుంది.

గోగినేని మణి కథల్లో ఉన్న పాత్ర చిత్రణను పరిశీలిస్తే కరుణరస స్వభావం గల పాత్రలు, సందేశాత్మక పాత్రలు, గ్రామీణ మనస్తత్వం గల పాత్రలు కనిపిస్తాయి. రచయిత్రి ఆయా కథల్లో ఉన్న ఇతివృత్తాన్ని బట్టి అటువంటి పాత్రలను ఎన్నుకున్నారు. ఇటువంటి పాత్రల చిత్రణలో, రచనా శిల్పంలో కొన్ని ప్రధమ పురుషలోను, కొన్ని ఉత్తమ పురుషలోను రాసి కథాకథన పద్ధతిని పాటించారు. వాటిలో మొదటిగా కరుణరస స్వభావం గల పాత్రల చిత్రణను పరిశీలిస్తే గోగినేనిమణి రచనా శిల్పంలో ఉన్న ప్రత్యేకత తెలుస్తుంది.

### 4.1.1 కరుణ రస స్వభావం గల పాత్రలు :

మనసును కరిగించేది, ద్రవింపచేసేది కరుణరసం, కరుణ రసానికి ఎటువంటి వారైనా కళ్ళను చెమర్చవలసిందే. నవరసాల్లో శృంగార, వీర రసాల తర్వాత పేర్కొనబడిందీ, ఉదాత్తమైందీ కరుణరసమే. కరుణరస ప్రధానమైన పాత్రలతో గోగినేని మణి కొన్ని కథలను రాశారు. వీరి రచనాశిల్పంలో పాత్రచిత్రణకు ఒక ప్రాధాన్యత ఉంది. వీరు కథకు

అనుగుణంగా పాత్రలను సృష్టించి ఆయా పాత్రలకు జీవం పోశారు. అదే వీరి రచనా శిల్పంలో చెప్పుకోదగ్గది. కరుణరస పాత్రలను కొన్నింటిని పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.

## ప్రభావతి పాత్ర చిత్రణ :

"నేను మంచి దానిని కాదు" కథలోని ప్రభావతి పాత్రను రచయిత్రి కరుణ రసాత్మకంగా చిత్రించారు. పాత్ర స్వభావరీత్యా గయ్యాళిలా కన్పించినా ఆమె మనసు కరుణతో నిండి ఉంటుంది. ఇంటి బాధ్యత అంతా తన మీదనే ఉండడం వలన చిరాకు పడుతుంది. వయసు మళ్ళిన అత్తగారు మంచానికే పరిమితం అవడం వలన ఆవిడ సేవలు కూడా చేస్తుంది. అత్తయ్య మనసుకి కష్టం కలిగించేటట్లుగా ఎప్పుడు ప్రవర్తించకూడదని మనసులో గట్టిగా అనుకుంటుంది. ప్రభావతి మరుదులు, తోడికోడళ్ళు తన అత్తయ్యను తమ వెంట తీసుకువెళ్ళడానికి ఇష్టపడరు. అత్తగారి వైద్యఖర్చుల నిమిత్తం భర్త తెచ్చిన ఇరవై వేల అప్పును తన చేతి బంగారు గాజులు తాకట్టు పెట్టి తీర్చివేయమంటుంది. అందుకు భర్త ఒప్పుకోకపోతే ప్రభావతి నచ్చచెప్పే సన్నివేశం కరుణ రసాత్మకంగా సాగింది.

"ప్రభావతి తన చేతి బంగారు గాజుల్ని తీసి రాఘవరావు చేతిలో పెట్టింది. బ్యాంక్‌లో పెట్టి ఫ్రెండు బాకీ తీర్చెయ్యమని సలహా ఇచ్చి, అతను సందేహిస్తోంటే నచ్చచెప్పింది. నాలుగైదు నెలల్లో ఎలాగో సర్దుబాటు చేసుకుని విడిపిద్దాం. నాకెప్పటి నుండో చేతుల నిండుగా మామూలు గాజులు వేసుకోవలనే కోరిక ఉంది. ఆ ముచ్చట ఇలా తీరుతుందని సంతోషిద్దాం! అంటూ నవ్వి అతని మొహమాటాన్ని పోగొట్టింది. అత్తగారికి తెలిస్తే బాధపడుతుందని ఆ సంగతి గోప్యంగానే ఉంచింది"[5]

ఆరోగ్యం కుదుట పడ్డాక అత్త మెడలోని గొలుసు ప్రభావతి తోడికోడలుకు భయపడి ఇచ్చేస్తుంది. ఆ సమయంలో అత్తను అపార్థం చేసుకుంటుంది ప్రభావతి. తర్వాత తాను అత్తను అపార్థం చేసుకున్న సంగతి తెలిసి పశ్చాత్తాప పడుతుంది. అత్తపేరున ఉన్న రెండెకరాల పొలాన్ని తన కొడుకులకు, కూతురుకు చెప్పి ప్రభావతి పేరున రాయిస్తుంది. ఆరోగ్యం బాగాలేని అత్తను చివరి రోజుల్లో తాను సరిగా ఆదరణ చూపించలేదని ఆమె ఇచ్చిన కానుకకు తను అనర్హురాలినని బోరున విలపిస్తుంది.

5. తొలిచూపు కథా సంపుటి – గోగినేని మణి – పుట 79

"ఒద్దు నాకేకానుకలూ వద్దు. అత్తయ్య నన్ను గుర్తించలేదని, అభిమానించలేదని అపోహ పడ్డానే తప్ప... ఇంకేమి ఆశించలేదు! ప్రేమగా ఇచ్చినా తీసుకునే అర్హత నాకు లేదు! సేవలు చేసినా గానీ చివరి రోజుల్లో మనస్ఫూర్తిగా చేయలేకపోయాను... మనసులో కోపం పెట్టుకునే చేశాను... నిజంగానే నేను మంచిదాన్ని కాదు..."[6] అంటూ ఆవేశంతో ఆ కాగితాలను చింపేసి, మోకాళ్ళలో తల దాచుకుని గుండెలలిసేలా రోదిస్తుంది ప్రభావతి.

ఈ విధంగా ప్రభావతి పాత్రను కరుణ రసాత్మకంగా తీర్చిదిద్దారు రచయిత్రి. కథలో ఈ పాత్రను ఉదాత్తంగా తీర్చిదిద్దారు. కథను చదువుతున్నంతసేపు సహృదయ పాఠకుని మనసు ద్రవింపజేస్తుంది. కథలో లీనమయిన పాఠకునికి కంట నీరు తెప్పించే పాత్ర ప్రభావతి. ఆమె ఉన్నతమైన మనసు పాఠకునికి కట్టిపడేస్తుంది.

## రమణమ్మ పాత్ర చిత్రణ :

"నేను మంచి దానిని కాదు" కథలో అత్త పాత్ర రమణమ్మ. రమణమ్మకు ముగ్గురు కొడుకులు, ఒక కూతురు. భర్త చనిపోయాక పల్లెలో ఒక్కరే ఉండలేక పల్లెలో ఉన్న ఇంటినీ, కొద్దిపాటి భూమిని అమ్మి కొడుకులకి, కూతురికి తలా కొంచెం పంచేస్తుంది. పుట్టింటి వాళ్ళు ఇచ్చిన రెండెకరాల పొలం మాత్రం ఆమె పేరున ఉంచుతుంది. ఆ పొలం నుండి వచ్చిన కౌలు డబ్బుతో తన ఖర్చులు కోసం వినియోగిస్తుంది. పెద్ద కొడుకు రాఘవరావు దగ్గర ఉంటూ కాలక్షేపం చేస్తుంటుంది. రెండవ కొడుకు వీరేంద్ర ప్రేమ వివాహం చేసుకుని ఉద్యోగరీత్యా ఉత్తరాది వైపే ఉంటాడు. వీరేంద్ర దగ్గరకు వెళ్ళాలని ఉత్తరం రాస్తే ఏవో కారణాలు చెబుతూ వద్దని అంటాడు. ఎండాకాలం ఎండలు అని, వర్షాకాలం వర్షాలని, చలికాలం చలిగా ఉంటుందని చెప్పి తల్లిని తీసుకెళ్ళకుండా దాటవేస్తుంటాడు. వీరేంద్ర పద్ధతి నచ్చక రమణమ్మ ఎంతగానో బాధపడుతుంది.

పక్కింటి మాణిక్యాంబతో కాలక్షేపం కోసం మాట్లాడుతూ తన మనసులో ఉన్న ఆవేదనను ఇలా వెలిబుచ్చుతుంది.

"చిన్నప్పుడు పిల్లలు అమ్మఒడిలో కూర్చోవటానికీ, అమ్మ పక్కన పడుకోవటానికీ 'అమ్మనాదీ' అంటూ పోటీలు పడి సరదాగా పోట్లాడుకుంటారు. వాళ్ళే పెద్దవాళ్ళయ్యాక 'అమ్మ బాధ్యత నాది మాత్రమేనా.. నీదీ, నీదీ' అని వంతులు వేసుకుంటుంటే... తల్లి

---

6. తొలిచూపు కథా సంపుటి – గోగినేని మణి – పుట 82

మనసుకెంత కష్టంగా ఉంటుందో వాళ్ళకి అర్థం కాదు! భగవంతుడి దయ వల్ల నాకలాంటి పరిస్థితి లేకపోవటం, కనిపెట్టి చూసే కోడలు దొరకటం నాఅదృష్టం..."[7] అని పెద్ద కోడలు ప్రభావతిని మెచ్చుకుంటూనే తన రెండవ కొడుకు ప్రవర్తనను గూర్చి బాధపడుతుంది.

రమణమ్మ మూడో కొడుకు సూర్యారావు కూడా పెద్ద కొడుకు రాఘవరావు ఉండే ప్రక్క వీధిలోనే ఉంటాడు. రమణమ్మ చిన్న కొడుకు దగ్గర కొన్నాళ్ళు ఉండడానికి వెళుతుంది. చిన్న కోడలు దెప్పి పోటు మాటలు భరించలేక వారం రోజులుఅయినా అక్కడ ఉండలేక పెద్ద కొడుకు దగ్గరకు వచ్చేస్తుంది. రమణమ్మ కూతురు ప్రమీల కూడా ప్రక్క ఊరిలోనే ఉంటుంది. కానీ ఆమె ఉమ్మడి కుటుంబంలో ఉండడం వలన కూతురింటికి వెళ్ళినా సాయంత్రం తిరిగి వచ్చేస్తుంది.

వయస్సు మీద పడటం వలన రమణమ్మ ఆరోగ్యం క్షీణిస్తుంది. హాస్పటల్ ఖర్చుల నిమిత్తం దాదాపు ఇరవై వేలు అవుతుంది. పెద్ద కొడుకు రాఘవరావు తన స్నేహితుడి దగ్గర అప్పుగా తీసుకుని చెల్లిస్తాడు. ఆ అప్పును తీర్చడం కోసం పెద్ద కోడలు ప్రభావతి చేతి గాజులు తాకట్టుపెడుతుంది. రమణమ్మ ఆరోగ్యం కోలుకున్నాక ఒకనాడు చిన్న కొడుకు ఇంటికి వెళ్ళి వస్తుంది. అక్కడి నుండి వచ్చిన తర్వాత ఆమె మెడలో గొలుసు లేకపోవడం గమనించిన ప్రభావతి గొలుసు ఏమైంది? అని అడుగుతుంది. చిన్న కోడలు గొలుసు కోసం భర్తను సాధిస్తుంటే మనసు ఉండబట్టక ఇచ్చేసాను అంటుంది. ప్రభావతి బాధపడినా బయటకు ప్రకటించక మనసులోనే అణచివేస్తుంది.

కొంత కాలానికి రమణమ్మ ఆరోగ్యం క్షీణిస్తుంది. కొడుకుల్ని, కూతుర్ని పిలిపిస్తుంది. తన పేర ఉన్న రెండకరాల పొలం ప్రభావతి పేరున రాయించానని అందుకు ఎవరూ అడ్డు చెప్పకూడదని అంటుంది. ప్రభావతి తనను కన్న తల్లిలా చూసుకుందని ఆ పొలం ఆమెకే చెందాలని తెలియజేసి కన్ను మూస్తుంది.

రచయిత్రి పాత్రను కరుణరసాత్మకంగా తీర్చిదిద్దారు. అందరూ ఉండి కూడా రమణమ్మను ఆదరించేవారు లేక ఒంటరితనాన్ని అనుభవిస్తుంది.

### విశాల పాత్ర చిత్రణ :

అతిథి దేవుడు కథలో చిత్రించిన కరుణరసాత్మక పాత్ర విశాల. తరచుగా బంధువులు

7. తొలిచూపు కథా సంపుటి – గోగినేని మణి – పుట 77

రావటం వలన సగటు స్త్రీ పడే ఇబ్బందిని ఈ పాత్రలో చూపించారు రచయిత్రి. విశాలది మధ్య తరగతి కుటుంబం. ఆమె ఇంటికి బంధువుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఆమె ఆరోగ్యం బాగుండదు. నీరసంగా ఉంటుంది. బంధువులకు మర్యాదలు చేసి పంపడం కోసం చేసిన అప్పు కూడా పెరుగుతుంది. అందుకే ఆమెకు బంధువులంటే భయం పట్టుకుంటుంది.

ఇంటి కాలింగ్ బెల్ మోగితే ఎవరో బంధువులు వచ్చారేమోనని భయపడిపోతుంది. ఆమె అనుకున్నట్లుగానే శివరామయ్య అనే స్నేహితుడు వస్తాడు. శివరామయ్య ఒకటి, రెండు రోజులు ఉండి వెళ్ళిపోతాడేమోననుకుంటే ఆయన ఎంతకి ఇంటి నుండి కదలడు. పదిహేను రోజులకు సరిపడే సరుకులు వారానికే అయిపోతాయి. మామూలుగా అయితే ప్రొద్దున్న వండిన కూరలు రాత్రికి సరిపెట్టేసేది. కాని ఇంటికి అతిథి వచ్చినందున ప్రతిపూటా వండాల్సి వస్తుంది. కూరగాయలు, పాలు అన్నీ ఎక్కువ కొనాల్సి రావటంతో అద్దు పెరిగిపోతుంది.

తనకిష్టమైన వంటలను చెప్పి మరీ చేయించుకుంటాడు శివరామయ్య. విశాల ఆరోగ్యం బాగోలేదని వంట చేయకుండా శివరామయ్యను హోటల్‌లో భోజనం చేసి రమ్మని చెబుతుంది. శివరామయ్య భోజనం చేసి విశాలకు తెస్తాడు. ఆమెను విశ్రాంతి తీసుకోమని చెప్పి రోజు హోటల్ నుండి తేవడం మొదలు పెడతాడు శివరామయ్య. విశాల అతని డబ్బులతోనే తెస్తున్నాడేమో అనుకుంటుంది. కాని విశాల భర్త ఊరికి వెళ్ళేముందు అప్పుగా తెచ్చిన సొమ్మును విశాలకు ఇవ్వమని శివరామయ్యకు ఇచ్చి వెళతాడు. ఆ డబ్బులతోనే రోజు హోటల్ నుండి భోజనం తెచ్చి పెడుతుంటాడు.

శివరామయ్య రోజుకో హోటల్ నుండి రోజుకో రకమైన భోజనం తీసుకువస్తాడు. దూరమైన హోటల్‌కి ఆటోలో గానీ, రిక్షాలో గానీ వెళ్ళి మరీ తీసుకువస్తాడు. బిర్యానీ, ఫ్రైడ్ రైస్ ఇలా అన్ని రకాల రుచులను విశాలకు చూపిస్తాడు. ఏదో పదిహేను రోజులు తమ ఇంట్లో ఉన్నందుకు అభిమానంతో ఖర్చు పెడుతున్నాడని అనుకుంటుంది విశాల. అయినా ఇంటికొచ్చిన బంధువుతో ఖర్చు పెట్టించటం ఏం మర్యాదగా ఉంటుందీ! చెప్పినా వినటం లేదు కాబట్టి ఈసారి వచ్చేటప్పుడు పిన్ని గారిని తీసుకురమ్మని చెప్పాలి. అప్పులు తీరి కొంత ఒడ్డున పడితే అప్పుడు ఆవిడకు ఒక చీర పెడితే సరిపోతుంది అని అనుకుంటుంది.

శివరామయ్య బయలుదేరుతూ వెళ్ళొస్తాను అంటే అలాగే బాబాయ్ గారు ఈసారి వీలు చేసుకుని పిన్ని గారిని కూడా తీసుకుని వచ్చి నాలుగు రోజులు ఉండాలని అంటుంది విశాల. అప్పుడు శివరామయ్య అసలు విషయం చెబుతాడు. చెప్పటం మరిచాను. అబ్బాయి ఊరికి వెళ్ళిన రోజు ఏదో లోను పెట్టి తీసుకున్న ఐదువందలు నీకివ్వమని ఇచ్చాడు. ఆ డబ్బులు నా దగ్గరే ఉంచి ఖర్చు చేసాను. మిగిలిన మూడు రూపాయలు ముప్పావలా అలమరాలో ఉంచాను అని చెప్పి వెళ్ళిపోతాడు. ఆ మాటలకు విశాల ఆశ్చర్యపోతుంది. అప్పు తీర్చడం కోసం తెచ్చిన డబ్బు హారతి కర్పూరంలా కరిగి పోయిందనుకుని తలపట్టుకుని కూలబడుతుంది. ఆయన వెళ్ళగానే మరో ఇద్దరు అతిధులతో తన ఇంటి ముందుకు వచ్చి రిక్షా ఆగుతుంది. వారిని చూడగానే విశాల అలా చూస్తూ బిగుసుకుపోతుంది.

మధ్య తరగతి కుటుంబాల్లో అతిథిలు వల్ల పడే ఇబ్బందులను తనదైన శైలిలో ఈ కథలో తెలియజేశారు రచయిత్రి. విశాల పాత్రను తీర్చిన తీరు పాఠకునికి ఆకట్టుకుంటుంది. లేనిపోని మొహమాటాలకు పోయి అప్పుల ఊబిలో కూరుకుపోతున్న మధ్య తరగతి జీవితాలను దగ్గరుండి పరిశీలించి విశాల పాత్రను సృష్టించారు రచయిత్రి. ఈ కథను చదువుతున్నంత సేపు ఈ పాత్ర పట్ల పాఠకునిలో జాలి కలుగక మానదు.

## అన్నపూర్ణమ్మ పాత్ర చిత్రణ :

"అమ్మా!... మన్నించవూ"! కథలో అన్నపూర్ణమ్మ పాత్ర కరుణ రసాత్మకంగా చిత్రించారు రచయిత్రి. తల్లి ఔన్నత్యాన్ని ఈ పాత్రలో తెలియజేస్తూనే సమకాలీన సమాజంలో కొడుకులు భార్యల మోజులో పడి తల్లులను నిరాదరణకు గురి చేస్తున్నారని తెలియజేసారు. చాకలి నరసమ్మ చీటీ కట్టగా వచ్చిన నాలుగు వేల రూపాయలను అన్నపూర్ణమ్మ వద్ద ఉంచుతుంది. అన్నపూర్ణమ్మ కొడుకు కేశవరావుకు డబ్బు అవసరమై ఆ నాలుగు వేల రూపాయలను అడిగి తీసుకుంటాడు. వడ్డీతో తిరిగి చెల్లిస్తానని తల్లికి మాట ఇస్తాడు. నాలుగేళ్ళు గడిచాయి. కొడుకు ఆ డబ్బు మాట ఎత్తడు. కోడలికి చెబితే అది అన్నపూర్ణమ్మ దాచుకున్న డబ్బేనని, ఎవరిదో అని చెప్పి తమకు వడ్డికిచ్చిందని అపార్థం చేసుకుంటుంది. తన భర్తతో కూడా అదే విషయం చెబుతుంది.

కోడలి వ్యవహార శైలి, నోటి దురుసుతనం నచ్చక అదే ఇంటిలో వేరే గదిలో విడిగా ఉండాలని నిశ్చయించుకుంటుంది. అన్నపూర్ణమ్మ తన అత్త కలిగించిన కష్టాలను తన కోడలికి కలిగించరాదని అన్ని విషయాల్లో ఆమెకు స్వతంత్రంగా ఉండనివ్వాలని అనుకుంది.

అదే ఆమెకు తన ఇంటిలోనే తనకి స్వతంత్రం లేకుండా చేసింది. కోడలి ప్రవర్తన తన మనసుకు ఎంత కష్టం కలిగించినా కొడుకు మనశ్శాంతి కోసం సహిస్తుంది. అన్నపూర్ణమ్మ గతకాలపు జ్ఞాపకాలను నెమరవేస్తూ తనకంటూ ఏమి మిగుల్చుకోలేదని బాధపడుతుంది.

సంపన్న కుటుంబంలో పుట్టి పెరిగి పిల్లల కోసం తన సర్వస్వం త్యాగం చేసి అవసాన దశలో ఇబ్బంది పడుతుంది. నరసమ్మ అప్పును తీర్చడం కోసం తన చేతి గాజులను అమ్మేస్తుంది. అది తెలియని కోడలు కూతురికిచ్చేసిందని అభాంఢం వేస్తుంది. భర్తను అడుగమని పంపిస్తుంది. కొడుకు కేశవరావు వచ్చి గాజుల విషయం ఆరా తీస్తాడు. అన్నపూర్ణమ్మ ఉక్రోషంతో చెల్లెలికి ఇచ్చానని ఎవరు అన్నారు? అని ఆవేశంతో అడుగుతుంది. నరసమ్మ డబ్బులు ఇవ్వడానికి అమ్మాను అంటుంది. ఆ విషయం ఎందుకు చెప్పలేదని కొడుకు అడిగేసరికి ఇలా సమాధానమిస్తుంది.

“ఎందుకు చెప్పలేదా? ‘అబద్ధమాడరాదు’ అంటూ నీకు నీతులు నేర్పించిన నేను నీకు అబద్ధం చెప్పలేదని సంజాయిషీ ఇచ్చుకోవటం అవమానం కాదూ? అయిన వాళ్ళతో వాదనెందుకని నాకు రావాల్సిన ఆస్తిని తేలిగ్గా వదులుకోగలిగిన నేను ఈ కొంచెం డబ్బు కోసం అబద్ధం చెప్పగలనని ఎలా అనుకున్నావు.”[8] అని ప్రశ్నిస్తుంది.

తాను చేసిన పొరపాటు కేశవరావు సరిదిద్దుకునేసరికి అన్నపూర్ణమ్మ లోకాన్ని విడిచి వెళ్ళిపోతుంది. రచయిత్రి ఈ పాత్రను తీర్చిదిద్దిన తీరు అమోఘం. ఆదర్శవంతమైన భావజాలంతో కరుణరసంతో నిండిన పాత్ర అన్నపూర్ణమ్మ. తన అత్త తనను వేధించినట్లు తాను తన కోడలిని వేధించరాదని నిశ్చయించుకున్న మహామనీషిగా ఈ పాత్రను తీర్చిదిద్దారు. దగ్గరి వాళ్ళతో పోట్లాట మంచిది కాదని తన అన్నతో ఆస్తి విషయంలో గొడవ పడక తృణప్రాయంగా వదిలివేసిన ఆదర్శమూర్తి అన్నపూర్ణమ్మ. డబ్బు విషయంలో కొడుకు అనుమానించి ప్రశ్నించేసరికి తట్టుకోలేక ప్రాణాలు విడిచిన కరుణామూర్తి అన్నపూర్ణమ్మ. కథను చదువుతున్నంత సేపు పాఠకునికి ఈ పాత్రపట్ల ఆలోచించే విధంగా పాత్రను సృష్టించారు రచయిత్రి.

---

**8. తొలిచూపు కథా సంపుటి - గోగినేని మణి - పుట 124**

## భారతి పాత్ర చిత్రణ :

"ఆచూపు" కథలో భారతి పాత్ర చిత్రణ కరుణరసాత్మకంగానే సాగింది. తాగుడు వ్యసనానికి బానిసలా మారిన భర్త కుటుంబ అవసరాలు పట్టించుకోకుండా ఉంటాడు. సంసారం వీధిన పడకుండా గుట్టుగా కాపురాన్ని నెట్టుకొస్తుంది భారతి. కొడుకు కంప్యూటర్ కోర్సులో చేరడానికి డబ్బులు అడిగితే లేదంటాడు కరుణారావు. భారతి కొడుక్కి డబ్బులిచ్చి పంపిస్తుంది. కిరాణా కొట్టువాడు, పాలవాడు చేసిన అప్పును అడగడానికి వచ్చినపుడు లేదని చెప్పి, కొడుకు కంప్యూటర్ కోర్సుకు డబ్బులివ్వడాన్ని గమనించిన అత్త భారతిని సందేహిస్తుంది. ఆ విషయమే రమణరావుతో చెప్పి నిలదీస్తుంది. ఇంటి పరువు కంటే కొడుకు చదువే ముఖ్యమా అని ప్రశ్నిస్తుంది. తల్లి మాటలు విన్న రమణారావు భార్యను కోపంగా నిలదీస్తాడు.

భర్త అనుమానించడాన్ని భారతి సహించలేకపోతుంది. దుఃఖంతో ఇలా అంటుంది. ఎక్కువగా మాట్లాడకండి! నా సహనానికయినా హద్దు ఉంది. అత్తగారికయితే మన కుటుంబ పరిస్థితి తెలియకపోవచ్చు. కానీ మీకు తెలియదా? ఇంటి ఖర్చులకి పోను నేనూ దాచుకునేటంతగా జీతం ఇంట్లో ఇస్తున్నారా? మొట్టమొదటగా వైన్ షాపులోని పద్దుకి జమ చేశాకే గదా మిగిలిన జీతం ఇంటికి తెస్తారు? పరువు గురించి మీరు మాట్లాడుతున్నారు! పెద్దలు మనకిచ్చిన ఆస్తిలో తృణమో పణమో అయినా మిగిల్చి మనమూ మన పిల్లలకివ్వాలన్న బాధ్యతను మర్చిపోయి మనం పొలం ఎందుకు అమ్మాల్సి వచ్చింది? పిల్లల చదువులకా... పెళ్ళిళ్ళకా... ఇల్లూ వాకిలీ ఏర్పరచుకోటానికా... దేనికీ కాదు. కేవలం మీ తాగుడు వ్యసనానికీ, ఫ్రెండ్సుతో జల్సాలకీ అయిన అప్పుల కోసం... భూమి, బంగారం అమ్ముకోవాల్సి వచ్చింది.

మీ సంపాదనలో సగం మీకే ఖర్చు పెట్టుకుంటూ, కొడుకు చదువు బాధ్యతని మాత్రం కూతురుకు చక్కగా అప్పజెప్పగలిగారు! మీరు పరువు గురించి మాట్లాడుతున్నారు! శంకరం మిమ్మల్ని ఏ సరదా కోసమో డబ్బు అడగలేదు. సాయంకాలాలు కూడా చదువుకుంటానని అడిగితే, మీకు వీలు కాకపోతే ఆ సంగతి చెప్పాల్సింది. కానీ తాగిన మత్తులో... అర్థం పర్థం లేని ఉపన్యాసం ఇస్తోంటే, వాడు మీవేపు... మీ చేతిలోని గ్లాసు వేపూ మార్చి మార్చి ఎలా చూశాడంటే... ఆ చూపులో... ఇప్పుడు నేనడిగిన ప్రశ్నలన్నీ నాకు వినిపించాయ్! కొరడా ఝుళిపించినట్లుగా వాడు చూసిన ఆ చూపుకి... మైకంలో

ఉన్న మీకేమీ తెలియలేదు గాని, నేను మాత్రం సిగ్గుతో తలవంచుకున్నాను! అందుకే.. మీ పరువు కాపాడటం కోసమే, వాడి దృష్టిలో మీరు పలుచనైపోకుడదనే.. పక్కింటి వాళ్ళబ్బాయితోనా... మంగళ సూత్రాల గొలుసు తాకట్టు పెట్టించి, ఆ డబ్బును మీరే ఇచ్చారని చెప్పి శంకరానికిచ్చాను"[9]

భారతి మాటలు విన్న కొడుకు చాలా బాధపడతాడు. తన కంప్యూటర్ కోర్సు కోసం తల్లి మంగళ సూత్రాలు తాకట్టు పెట్టిందని తెలిసి కుమిలిపోతాడు. బాధపడుతున్న కొడుకును ఓదార్చుతూ తప్పు నీది కాదు, మీ నాన్నకు పట్టుకున్న వ్యసనానిది అని చెబుతుంది. పెద్దలు పిల్లలు చదువుకునే మంచి పుస్తకాల్లా ఉండాలని, తల్లిదండ్రులు తమ ప్రవర్తన ద్వారానే పిల్లలకి మంచి బుద్దులు నేర్పించగలగాలని ఈ పాత్ర ద్వారా రచయిత్రి సమాజానికి తెలియజేసారు.

## 4.1.2 సందేశాత్మక పాత్రలు :

ఏ కథలోనైనా ఏదో ఒక నీతి గాని సందేశంగాని ఉంటుంది. రచయిత తను అనుకున్న విషయాన్ని కథారూపంలో చిత్రించదలచుకున్నప్పుడు ఆ విషయాన్ని వస్తువు లేక ఇతివృత్తంలో బంధిస్తాడు. లేదా కథలో ఏదో ఒక పాత్రను ఎంచుకుని ఆ పాత్ర ద్వారా తాను చెప్పదలచుకొన్న సందేశాన్ని వివరించే ప్రయత్నం చేస్తాడు. అటువంటి సందర్భాల్లో ప్రధాన పాత్రలతో పాటు అప్రధాన పాత్రలతో కూడా సందేశాన్ని చెప్పించే ప్రయత్నం చేస్తాడు రచయిత. తన దృష్టి కోణం ప్రకారం అప్రధాన పాత్రలతో సమాజానికి సందేశాన్ని ఇప్పించే ప్రయత్నం చేసి, ఆ కథను తన రచనా శిల్పంతో పాఠకుల హృదయాలను ఆకర్షించేటట్టు మలుస్తాడు. ఇది రచయిత యొక్క ప్రతిభా, వ్యుత్పత్తి, అభ్యాసాల మీద ఆధారపడి ఉంటుంది.

గోగినేని మణి రచనల్లో కొన్ని కథలలో సందేశాత్మక పాత్రలను ప్రవేశపెట్టి సమాజానికి గొప్ప సందేశాన్నిచ్చారు. వాటిలో ముఖ్యంగా చెప్పుకోదగ్గవి.

---

9. మనసున మల్లెలు కథా సంపుటి – గోగినేని మణి – పుట 93,94

## రఘు పాత్ర చిత్రణ :

"తొలి చూపు" కథలోని ప్రధాన పాత్ర రఘు కథ మొత్తం ఈ పాత్ర చుట్టూనే తిరుగుతుంది. చక్కటి ఆదర్శవంతమైన పాత్రను చిత్రించారు రచయిత్రి. కథ ప్రారంభంలో ఈ పాత్ర పట్ల పాఠకునిలో వ్యతిరేఖ భావం కలుగుతుంది. కథాంతానికి వచ్చేసరికి పాఠకుడు ఏర్పరచుకున్న అభిప్రాయం తప్పని తెలుసుకుంటాడు. రఘు తల్లిదండ్రులు అతని కోసం నీరజ అనే అమ్మాయిని ఖాయపరిచి ఆమెను ఒక సారి చూసి రమ్మని పంపిస్తారు. రఘు నీరజ కోసం వెళ్ళి ఆ ఊరిలోనే ఉన్న శారద అనే అమ్మాయిని ఇష్టపడుతున్నట్లు తల్లిదండ్రులతో చెబుతాడు. ఆ అమ్మాయినే పెళ్ళి చేసుకుంటానంటాడు. శారద నీరజ కంటే అందగత్తెకాదు. ఆస్తిపాస్తులు లేవు అని రఘు తల్లి బాధపడుతుంది. కారణమేంటో రఘుని అడిగితే దాటవేస్తుంటాడు.

రఘు తల్లి తన కూతురు శాంత చేత అడిగించాలనుకుంటుంది. శాంతను అతని వద్దకు పంపిస్తుంది. శాంత తమ్ముడి నిర్ణయానికి కారణమేంటో తెలుసుకోవాలని అతని గదికి వెళుతుంది. రఘుని ఎంత అడిగినా సరైన కారణం చెప్పడు. శాంత భర్త యాక్సిడెంట్‌లో చనిపోతే తన పిల్లలతో పుట్టింట్లోనే వుంటుంది.

రఘు మనసుకు నచ్చిన అమ్మాయిని ఇచ్చి చేయటమే మంచిదని నిర్ణయించి శారదతో రఘు పెళ్ళిని జరిపిస్తారు. రఘు భార్య శారదకు కూడా రఘు నిర్ణయం పైన సందేహం కలుగుతుంది. నీరజను చూడటానికి వచ్చి తనను ఇష్టపడిన సంగతి తనకు తెలుసు, కానీ కారణమేంటో తనకి అర్థం కాదు. అదే విషయాన్ని మొదటి రాత్రి ప్రేమగా దగ్గరకు తీసుకున్న రఘుని అడుగుతుంది. ఏమి కారణం లేదని రఘు తప్పించుకోవాలని చూస్తాడు. అందం, ఆస్తి ఉన్న నీరజ కంటే తనే ఎందుకు నచ్చానని, తనలో ఉన్న ఆకర్షణ ఏమిటని ప్రశ్నిస్తుంది. చెప్పి తీరాలని శారద పట్టు పడుతుంది. ఇక చెప్పక తప్పదని అసలు విషయాన్ని భార్యతో చెబుతాడు రఘు.

నీరజను చూడడానికి వెళ్ళినప్పుడు నీరజతో కలిసి సినిమాకు వెళతాడు రఘు. అక్కడ నీరజ సీట్ల కోసం కుర్రాళ్ళతో గొడవ పెట్టుకుంటుంది. అక్కడే ఉన్న శారద సీట్ల విషయంలో తగవు ఎందుకని తన సీటును నీరజకు కేటాయించి నీరజ సీటులో సర్దుకుంటుంది. అక్కడ నీరజలోని నిరంకుశత్వాన్ని, శారదలోని సర్దుబాటుతత్వాన్ని అర్థం చేసుకున్నానని అంటాడు రఘు. భర్త చనిపోయి పిల్లలతో తన ఇంట్లోనే ఉన్న అక్క బరువు,

బాధ్యతలు అన్నీ తనవే. కావున ఆ బాధ్యతలను సక్రమంగా ఆనందంగా నిర్వహించాలి. అమ్మ, నాన్నలతో ఎప్పటికీ కలిసి ఉండాలి. కావున ఉమ్మడి కుటుంబంతో నీరజ ఇమడలేదు.

సినిమా హాలులో సీటు విషయంలో తగవు పడిన అమ్మాయి వచ్చి, తన సంపాదనలో తన అక్క ఆమె పిల్లలు పాలుపంచుకోవడాన్ని సహించలేదని నిర్ణయిస్తాడు. ఇతరుల కోసం ఏదైనా త్యాగం చేసే స్వభావం శారదలో కనిపించినందున ఆమె తనకి తగిన భార్య అని నిశ్చయిస్తాడు. రఘు ఆదర్శభావానికి శారద కళ్ళు చెమ్మగిల్లుతాయి. పాఠకునిలో కూడా రఘు పట్ల ఆరాధనా భావం కలుగుతుంది. నేటి సమాజంలో ప్రతి కుటుంబంలో రఘులాంటి ఆదర్శ వ్యక్తులు ఉంటే ఆ కుటుంబంలో ఎటువంటి గొడవలు లేకుండా శాంతి నిలయాలుగా మారతాయి.

## ఉమాదేవి పాత్ర చిత్రణ :

"గాజులు తొడిగిన చెయ్యి" కథలో ఆదర్శ పాత్ర ఉమాదేవి. కథలో కీలకమైన పాత్ర. తన భర్త పిచ్చితనాన్ని పోగొట్టడానికి తానే పిచ్చిదానిలా వేషం వేసి భర్త చికిత్స కోసం ఉమాదేవి హాస్పటల్‌లో చేరుతుంది. భర్తలో వచ్చిన మానసికమైన మార్పును గుర్తించి చికిత్స చేసుకోమంటే ఒప్పుకోడని తెలిసి తనే పిచ్చిదానిలా నటిస్తూ తనకి సహాయకుడిగా భర్తను ఉండమని డాక్టర్ చేత చెప్పిస్తుంది.

ఉమాదేవి భర్త మధుసూదనరావు అతని సవతి తల్లి, ఆమె స్వంత కొడుకులు మధుసూదనరావుకు వ్యాపార విషయాలలో ఏ నిర్ణయాలు తీసుకోనివ్వకుండా నీకేం తెలియదంటని చిన్నచూపు చూడటం మొదలుపెట్టడం వలన అతనిలో ఆత్మన్యూనతాభావం కలిగి మనోవ్యాధికి గురవుతాడు. ఆ వ్యాధిని గుర్తించిన ఉమాదేవి అత్తకు, మరుదులకు తెలిస్తే అతని మనసును మరింత గాయపరుస్తారని తెలిసివాళ్ళకు తెలియనివ్వకుండా జాగ్రత్తపడుతుంది. తనకే పిచ్చి వచ్చినట్లు నటించి ఆమెకు తోడుగా భర్తను తీసుకునివెళ్ళి చికిత్స చేయిస్తుంది. భర్త పట్ల ఆమెకున్న శ్రద్ధాసక్తులకీ, అనురాగానికి వైద్యులు కూడా మెచ్చుకొని అంగీకరిస్తారు.

ఉమాదేవి పాత్ర ఔన్నత్యాన్ని తెలియజేస్తూ రచయిత్రి కథాంతంలో ఇలా అంటారు. "ఏ మగవాడైనా తన పౌరుషం గురించి చెప్పుకునేటప్పుడు "నేనేం గాజులు తొడుక్కోలేదు" అనే మాటని ఉపయోగించటం సరికాదని, లాలించే గాజుల చేతులు అవసరమైనప్పుడు మగవాడికంటే కూడా ధృఢంగా కొరడా నిఘ ఝుళిపించగలవు"[10]

## అశోక్ పాత్ర చిత్రణ :

"మమతలహారం" కథలో ఆదర్శవంతమైన పాత్ర అశోక్. అశోక్‌కి స్కూటర్‌ను కొనివ్వడానికి అతని అత్త మెడలోని హారంను అమ్మేస్తుంది. ఆ హారం ఆమె తల్లి జ్ఞాపకంగా ఉంచుకున్న హారం కావున అశోక్ భార్య సుమ ఎంతగానో బాధపడుతుంది. భార్య మనసును గుర్తించిన అశోక్ అత్త కోసం ఒక హారాన్ని చేయిస్తాడు. ఆ విషయం భార్యతో కూడా చెప్పకుండా ఒక నాడు అత్తగారింటికి భార్యతో పాటు వెళ్ళి అత్తకు కానుకగా ఇస్తాడు. "మీ అందరికీ ఇష్టమైన, మీ అమ్మగారి జ్ఞాపకంగా వున్న హారాన్ని మేం అడగకపోయినా, మా అవసరాన్ని తెలుసుకుని మీరు అమ్మేశారు. మీ అభిమానానికీ, ఆప్యాయతకూ ప్రతిగా నా సంతోషం కొద్దీ మీకు ఓ చిన్న కానుక ఇవ్వాలని నాకు అనిపించింది. అందుకే ఇది తీసుకువచ్చాను. ఇది ఆ హారంలాగే ఉండకపోవచ్చును. కానీ మీ అమ్మ గారి జ్ఞాపకం చేస్తుండాలని అలాగే చేయించటానికి ప్రయత్నం చేశాను"[11] అంటాడు.

అశోక్ మాటలకు అభిమానంతో అతని అత్త కన్నులుతో పాటు, మనసు కూడా చెమ్మగిల్లుతుంది. అది ఆమెకు మామూలు హారంలా కనిపించలేదు. మమతల హారంలా కన్పిస్తుంది. అల్లుడి ఔదార్యానికి, ఔన్నత్యానికి ఆమె ఆనందభాష్పాలు కారుస్తుంది. ఈ పాత్రను ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దారు రచయిత్రి. కట్న, కానుకల కోసం వేధింపులకు గురి చేసే అల్లుళ్ళను చూస్తున్న నేటి సమాజానికి సందేశాత్మకమైన అశోక్ పాత్రను చిత్రించి మేలుకొల్పారు. అల్లుడు అంటే పరాయివాడు కాదని అత్తమామలను తల్లిదండ్రులుగా చూడాలని అంతర్లీన సందేశంతో కూడుకున్న పాత్ర అశోక్. పాఠకుడు జీవన పర్యంతం గుర్తుంచుకోదగ్గ పాత్రను సృష్టించి పాఠకుల హృదయాలను గెలుచుకున్నారు రచయిత్రి.

## వినయ్ పాత్ర చిత్రణ :

"అపోహ" కథలో సందేశాత్మక పాత్ర వినయ్. కథ ప్రారంభంలో వినయ్ పాత్రను పాఠకుడు పిసినారిగా భావిస్తాడు. కాని కుటుంబ బాధ్యతల కోసమే తాను అలా ప్రవర్తించవలసి వచ్చిందని కథాంతంలో తెలుసుకుంటాడు. వినయ్ తండ్రి గారాబంగా తనని పెంచుతాడు. తన కోరికలను అడగకుండా తీర్చేవాడు. చిన్నప్పుడు పక్కింటి అబ్బాయి సైకిలు తొక్కుతుంటే వినయ్ ఆసక్తిగా చూడటాన్ని గమనించిన అతని తండ్రి మర్నాడే తన కోసం కొత్త సైకిలు కొని తెస్తాడు. అటువంటి తండ్రి యాక్సిడెంట్‌లో చేయి పోగొట్టుకుంటాడు. చేయి పోవడంతో ఉద్యోగం పోతుంది. ఉన్న డబ్బుతో కూతురు వివాహం చేసి బాధ్యత తీర్చుకుంటాడు.

ఆస్తిపాస్తులు ఏమీ లేకపోవటంతో వినయ్ పరిస్థితి తారుమారవుతుంది. తన చదువును పూర్తి చేసి కుటుంబ పరిస్థితి చక్కబట్టేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో తండ్రి అనారోగ్యంతో మరణిస్తాడు. తండ్రి హాస్పటల్ ఖర్చులకు, దినకార్యాలకు చేసిన అప్పును తీర్చటం కోసం పొదుపుగా ఉంటాడు. వినయ్ పొదుపురితనం చూసి తన సహోద్యోగులు వినయ్‌ను పిసినారిగా భావిస్తారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న తల్లికి తోడుగా ఉండటం కోసం ఆఫీసవగానే ఇంటికొచ్చేస్తాడు. సినిమాలకి, షికారులకి వెళ్ళకపోవడం అది ఒక కారణమే అని అంటాడు. సహోద్యోగులు పిసినారి అని ఆట పట్టించినా బాధపడేవాడు కాదు. కాని తన కష్టనష్టాల గురించి వారికి చెప్పి బాధపెట్టడం వినయ్‌కి ఇష్టం లేదు. కనుక తన బాధలను ఇతరులకు చెప్పేవాడు కాదు.

వినయ్ సహోద్యోగి అక్క కూతురుతో వినయ్ వివాహం నిశ్చయం అవుతుంది. అతడి గూర్చి ఆరా తీయడానికి వెళితే అతని ఉన్నత స్వభావం తెలుస్తుంది. తాను పిసినారినని అపోహపడిన వ్యక్తి ఉన్నతమైన ఆదర్శాలు కలవాడిగా కన్పించే సరికి అతడి దృక్పథం మారుతుంది. బాధ్యతలని ప్రేమగా స్వీకరించే వ్యక్తి భార్యాబిడ్డలకు ఎటువంటి లోటూ కలిగించడని భావిస్తాడు. కుటుంబ బాధ్యతలను గాలికి వదిలేసి, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే నేటి యువతకు మార్గదర్శకంగా ఉండాలని ఈ పాత్రను సృష్టించారు రచయిత్రి. వినయ్ లాంటి ఆదర్శ భావాలు, ఉన్నత వ్యక్తిత్వం నేటి సమాజంలో ఏ కొందరికో ఉంటాయి. తన సరదాలను పక్కన పెట్టి బాధ్యతలని ప్రేమగా స్వీకరించే వ్యక్తులు అరుదుగా ఉంటారు. అటువంటి వారి జీవితాలను సమకాలీన సమాజానికి ఆదర్శ ప్రాయమవుతాయి. రచయితల రచనలు సమాజంలో ఉన్న చెడ్డ లక్షణాలు తొలగించి ఉన్నతమైన,

ఆదర్శవంతమైన భావాలను సాటి మనుషులలో కలిగించగలగాలి. అటువంటి రచనలు ఆదర్శవంతంగా నిలుస్తాయి. రచయిత్రి గోగినేని మణి ఈ లక్ష్య సాధనలో నూటికి నూరుపాళ్ళు సఫలీకృతులయ్యారు అనటంలో సందేహం లేదు. ఆమె రచనలలో వినయ్ లాంటి పాత్రలు కోకొల్లలు.

## మనస్విని పాత్ర చిత్రణ :

"కలిసిన హృదయాలలోన" కథలో సందేశాత్మక పాత్ర మనస్విని. కథలో ప్రధాన పాత్ర కూడా ఈమెదే. మనస్విని రాజేష్ అనే అబ్బాయిని ప్రేమిస్తుంది. ఆమె కుటుంబం కూడా ఆమె మాటను కాదనరు. తను ప్రేమించిన అబ్బాయితోనే పెళ్ళి నిశ్చయపరుస్తారు. ముహూర్తాలు పెట్టుకునే సమయానికి వద్దని అంటుంది. కారణమేంటో తెలియక కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతారు. మనస్వినిని పెళ్ళి చేసుకుంటానని రాజేష్ చెప్పిన రోజే కట్న కానుకలు ఇచ్చిపుచ్చుకొనే ఆచారం తనకి ఇష్టం లేదని చెబుతుంది. అందుకు రాజేష్ కూడా అంగీకరిస్తాడు. కానీ సంబంధం కుదుర్చుకోవడానికి వచ్చిన వాళ్ళు మనస్విని తల్లిదండ్రులతో కట్నకానుకలపై బేరసారాలు మొదలుపెడతారు. సంబంధం కావాలని వచ్చిన వాళ్ళను కట్నం అడిగితే కొంతైనా సమంజసంగా ఉంటుందేమో కానీ, ప్రేమించిన అబ్బాయి తరపు వాళ్ళు వచ్చి కట్నం అడగడం ఆమెకు అస్సలు నచ్చదు.

మనస్విని తల్లిదండ్రులు ఆమె పెళ్ళి కోసం ఇవ్వవలసిన కట్న కానుకల కోసం గృహ ప్రవేశం కూడా జరగని కొత్త ప్లాటును అమ్మాలనుకుంటారు. అది ఆమెను ఎంతగానో బాధిస్తుంది. అందుకే పెళ్ళి వద్దనుకుంటుంది. పెళ్ళి ఒక్కటే జీవిత పరమార్థం కాదు అని అంటుంది. ఆడపిల్ల తల్లిదండ్రులకు పెళ్ళి అనేది ఆనందంగా నెరవేర్చాల్సిన బాధ్యతగా ఉండాలి తప్ప భారం కాకూడదని అంటుంది.

రాజేష్ తల్లి రుక్మిణి విషయం తెలుసుకుని వస్తుంది. మనస్వినికి అన్ని విధాలా నచ్చచెబుతుంది. కట్నమే సమస్య అయితే వద్దని అంటుంది. వ్యక్తిత్వం, ఆత్మగౌరవం ఉన్న అమ్మాయిని తన కొడుకు ప్రేమించినందుకు గర్వపడుతుంది. లాంఛనాలు ఏమి లేకుండా పెళ్ళి చేసుకోవడానికి నిశ్చయించుకుంటారు. ఆడంబరాలు లేకుండా, అప్పుల పాలవ్వకుండా పెళ్ళి చేసుకోవడానికి అంగీకరిస్తారు. పెళ్ళి ఆడంబరంగా జరగటం కంటే ఆనందంగా జరగటమే మధ్యతరగతి వారికి కావాల్సింది. బీరువాలో దాచే పట్టుచీరల కోసం అనవసరమైన ఖర్చు చేయటం తగదని అంటుంది.

ఒక కొత్త సాంప్రదాయానికి శ్రీకారం చుడుతున్నందుకు మనస్విని తండ్రి అభినందిస్తాడు. కూతురి ఆత్మవిశ్వాసం, ధైర్యం చూసి మనస్విని తల్లి గర్వపడుతుంది. చక్కటి పాత్ర చిత్రణ చేశారు రచయిత్రి. మనస్విని అభ్యుదయ భావాలు గల యువతిగా కన్పిస్తుంది. అమ్మాయిలు, అబ్బాయిలు కంటే తక్కువ అనే భావన ఉన్న నేటి సమాజానికి ఈ పాత్ర ద్వారా మేల్కొల్పారు రచయిత్రి. అబ్బాయి ప్లస్, అమ్మాయి మైనస్ అని అవమానకరంగా మాట్లాడటం తగదని ఈ పాత్ర ద్వారా చెప్పించారు. కొడుకుతో పాటు కూతురికి ఆస్తిలోనే కాదు బాధ్యతల్లో కూడా పాలు పంచుకోవాలని ఈ పాత్ర ద్వారా సమాజానికి తెలియజేసారు రచయిత్రి.

## గోపాలరావు పాత్ర చిత్రణ :

"రాట్నం పిలిచింది" కథలో సందేశాత్మక పాత్ర గోపాలరావు. తన తండ్రి ఇచ్చిన నోటి మాటకు కట్టుబడి పది లక్షలు విలువ చేసే పొలాన్ని ఇచ్చేసే ఆదర్శవంతమైన పాత్ర. గోపాలరావు తండ్రి తన గుమస్తా రమణారావు దగ్గర పదివేల రూపాయలు తీసుకుని నోటిమాటగా రెండెకరాలు ఇస్తానని అంటాడు. అతను చనిపోయే సమయంలో వీలునామాలో కూడా ఆ విషయాన్ని చేర్చి ఉంటాడు. కాలం గడిచి పోతుంది. గోపాలరావు కొడుకులు పెద్దవారవుతారు.

గోపాలరావు కొడుకులతో రమణారావుకి ఇవ్వవలసిన పొలం విషయం చెబుతాడు. అందుకు కొడుకులు ఒప్పుకోరు. ఎప్పుడో నోటి మాటగా చెప్పిన దానికి పది లక్షల విలువ చేసే పొలం ఇవ్వడం ఎందుకు. పది వేలు వడ్డీ లెక్క కట్టి ఇచ్చేస్తే సరిపోతుంది అంటారు. అందుకు గోపాలరావు మనసు అంగీకరించదు. తాత రాసిన వీలునామాను గోపాలరావు చిన్న కొడుకు బాలాజీ చింపేస్తాడు. వీలునామా గురించి పట్టించుకోనవసరం లేదని అంటాడు. కొడుకు మాట విని గోపాలరావు నిశ్చేష్టుడుగా ఉండిపోతాడు. భార్య కమలమ్మ, గోపాలరావును ఓదారుస్తుంది.

గోపాలరావు తన తల్లి, దండ్రుల నీతినిజాయితీల గూర్చి, మాటకు కట్టుబడి కోట్ల విలువ చేసే ఆస్తిని ధారాదత్తం చేసిన సంగతులను భార్యతో వివరంగా చెబుతాడు. గోపాలరావు ఉన్నత వ్యక్తిత్వానికి ఆమె భార్య మురిసిపోతుంది. తీర్చలేని పరిస్థితిని క్షమించవచ్చుగాని తీర్చగలిగే స్థోమత ఉండి తీర్చాలని అనుకోకపోవటం మాత్రం నేరమే అని కమలమ్మ భావిస్తుంది. భర్త నిర్ణయంతో ఏకీభవిస్తుంది. కొడుకులు వింటారనే నమ్మకంలేక

తనకు పుట్టింటి వాళ్ళు ఇచ్చిన రెండెకరాల పొలాన్ని రమణారావుకి ఇచ్చేయండి అని అంటుంది. పిల్లలు కాదనటానికి వారి హక్కు ఉండదు. కావున మీ తండ్రి మాటను తీర్చిన వారు అవుతారని అంటుంది.

గోపాలరావు కమలమ్మ మాటలకు ముగ్దుడవుతాడు. గోపాలరావు తన మాట దక్కుతున్నందుకు ఆనందపడతాడు. మారిపోతున్న పరిస్థితులు, పెరిగిపోతున్న ధనదాహం, పతనమవుతున్న మానవీయ విలువలను మార్చడానికి సరికొత్త ఆదర్శవంతమైన సమాజ నిర్మాణానికి గోపాలరావులాంటి పాత్రలు దోహదం చేస్తాయి. గోపాలరావు పాత్రను రచయిత్రి తీర్చిదిద్దిన తీరు అమోఘం. ఇచ్చిన మాటనే తప్పుతున్న నేటి సమాజంలో తండ్రి మాటకు కట్టుబడి ఉండటం అందరికి సాధ్యం కాదు. ఈ పాత్ర ద్వారా సమాజానికి చక్కటి సందేశాన్నిచ్చారు రచయిత్రి.

## ప్రభాకరం పాత్ర చిత్రణ :

"మిత్రమా మన్నించూ!" కథలో సందేశాత్మక పాత్ర ప్రభాకరం. ప్రభాకరంను తన తోటి స్నేహితులు పిసినారి ప్రభాకరం అని పిలుస్తుంటారు. అతను అనవసరమైన ఖర్చులు చేయకుండా పొదుపుగా ఉంటాడు. అది అతని స్నేహితులకు నచ్చదు. ఒక సారి తన స్నేహితుడు నాగేంద్ర రెండు వందలు అవసరం వచ్చి అడిగితే ఎందుకు అని ప్రశ్నిస్తాడు. నాగేంద్ర తాను ప్రేమిస్తున్న అమ్మాయికి డిన్నర్ ఇవ్వడానికి తీసుకువెళుతున్నాను అందుకే కావాలి అంటాడు. అనవసరమైన ఖర్చులకు ఇవ్వనని, ముఖ్యమైన అవసరానికి ఇచ్చి నేను ఇబ్బంది పడినా పర్వాలేదు కాని, జల్సా చేయడానికి ఇచ్చి నేను ఇబ్బంది పడకూడదు అని తెగేసి చెప్పేస్తాడు. నాగేంద్ర తన తోటి స్నేహితులతో జరిగిందంతా చెబుతాడు. ప్రకాశం తన పర్సులోని నోట్లు తీసి నాగేంద్ర చేతిలో పెడతాడు. ప్రకాశం జల్సారాయిడిలా ఖర్చు పెడుతుంటాడు. తనకు భూషయ్య అనే వ్యక్తి డబ్బు పంపిస్తున్నట్లు చెబుతాడు. తనకి ఏ చిన్న ఇబ్బంది వచ్చినా తానే చూసుకుంటాడని చెబుతాడు.

ప్రభాకరం పిసినారితనాన్ని చూసిన తోటి స్నేహితులు పిసినారి ప్రభాకరం అని అతడిని ఆటపట్టిస్తుంటారు. ప్రభాకరం వాటిని పట్టించుకోడు. ప్రభాకరం పుట్టినరోజు నాడు స్నేహితులు ఏదైనా కథ చెప్పమంటారు. తన జీవితంలో జరిగిన సంఘటనను కథగా చెప్పడం ప్రారంభిస్తాడు. ఒకసారి పని మీద వేరే ఊరు వెళ్ళవలసి వస్తే మధ్యలో తన బండి చెడిపోవడం వల్ల సుబ్బారాయుడు అనే ఆసామి ఇంట్లో అతిథిగా ఉంటాడు.

చూడడానికి సంపన్నుల వలె ఉన్నా తిండి కోసం ఇబ్బంది పడుతుంటారు. పంటలు సరిగా పండక అప్పులు పెరిగి ఆస్తులు కరిగిపోయాయి. మిగిలిన కొద్దిపాటి భూమి మీద వచ్చే ఆదాయంతో జీవనాన్ని సాగిస్తున్నట్లు చెబుతాడు.

కొడుకు దూరంగా ఉంచి చదవించాల్సిన అవసరంతో అప్పులు పెరిగిపోతాయి. ఇంకా అప్పుల ఊబిలో కూరుకుంటే ఉన్న ఇంటిని కూడా అమ్మాల్సి వస్తుందని భావించి పొదుపుగా ఉంటూ సంసారాన్ని గుట్టుగా నెట్టుకొస్తున్నారు. కొడుకు చదువుకోసం ఆ కుటుంబం చేస్తున్న త్యాగానికి నివ్వెరపోయాను అంటాడు. అప్పటి నుండి తన ఖర్చులను తగ్గించుకుని సుబ్బారాయుడు గారికి సేవాసంస్థ పేరుతో సహాయం చేస్తూ వస్తున్నాను అంటాడు. స్నేహితులు ఎవ్వరూ ప్రభాకరం కథను నమ్మరు. చివరి సంవత్సరం పరీక్షలు పూర్తైన తర్వాత అందరూ ఎవరి ఇళ్ళకు వారు వెళ్ళిపోతారు. ప్రకాశం కూడా ఇంటికి వెళ్ళాక తనకు సహాయం చేస్తున్న భూషయ్య గూర్చి తెలుసుకోవాలని అనుకుంటాడు. తండ్రి ద్వారా విషయం తెలుసుకుంటాడు. తనకు సహాయం చేస్తున్నది ప్రభాకరమేనని తెలిసి పశ్చాత్తాప పడతాడు. రచయిత్రి ప్రభాకరం పాత్రను సహృదయత, సంస్కారం కలిగిన పాత్రగా తీర్చిదిద్దారు. ఒకరికి సహాయపడటంలో ఉన్న ఆనందం వేరే దేనిలో ఉండదని ఈ పాత్ర ద్వారా తెలియజేసారు.

## చుక్కమ్మ పాత్ర చిత్రణ :

"చుక్కమ్మ" కథలోని ప్రధాన పాత్ర చుక్కమ్మ. కథలోని ఈ పాత్ర చూపించిన మానసిక పరిణతి పాఠకునికి ఆలోచింపజేస్తుంది. చదువు సంధ్యలు లేని గ్రామీణ పాత్రగా కనిపించినప్పటికి తన తెలివి తేటలతో అటు కన్నవారి ఇంట, ఇటు మెట్టి నింట మనస్పర్ధలు లేకుండా చేస్తుంది. చుక్కమ్మ తండ్రి తనకి ముప్పైవేలు రూపాయలు ఇస్తానని మాటిస్తాడు. ఆయన చనిపోయిన తర్వాత ఆమె అన్న డబ్బు సంగతి గురించి పట్టించుకోదు. చుక్కమ్మ అత్త సూటిపోటి మాటలు అంటూ శాపనార్థాలు పెడుతుంది.

అత్త కన్నవారిని శాపనార్థాలు పెట్టడం చుక్కమ్మను బాధిస్తుంది. అప్పుడు ఒక చక్కటి ఉపాయం ఆలోచిస్తుంది. తన మెడలోని బంగారం గొలుసు పోలేరమ్మ జాతరలో పోగొట్టుకున్నాని చెప్పి ఒక షావుకారు వద్ద తాకట్టు పెడుతుంది. తన అన్నకి, భర్తకి విషయం తెలియనివ్వవద్దని షావుకారుతో చెబుతుంది. ఆ తాకట్టు పెట్టిన డబ్బులు వడ్డీ లేకుండా షావుకారు చేత అన్నకి ఇప్పిస్తుంది. ఆ డబ్బులను తెచ్చి తన అత్త చేతిలో పెడుతుంది. చుక్కమ్మ కథలో ఒకానొక సందర్భంలో ఇలా అంటుంది.

"అటూ ఇటూ కూడా కావల్సినవోళ్ళేగా పుట్టింటోళ్ళకి కష్టం కలక్కూడదు... కట్టుకున్నోడికి నష్టం రాకూడదు"[12]

తోడబుట్టిన వాడు పదికాలాల పాటు పచ్చగా ఉండాలనే ఏ ఆడపిల్లయినా కోరుకుంటుంది. అత్త శాపం తగిలి అన్నకు ఏమవుతుందో అనే భయంతో తాను ఈ నాటక మాడి పుట్టింటి నుండి డబ్బు తెచ్చి ఇస్తుంది. అన్న షావుకారు దగ్గర తెచ్చిన బాకీ తీరిస్తే తన గొలుసు తన వద్దకి వస్తుంది. తీర్చక పోయినా పర్లేదు అంటుంది. నగ శరీరం మీదుంటే మెరుపొస్తుంది. కానీ తన బంగారం బంధుత్వానికి మెరుగు పరిచేందుకు ఉపయోగపడింది. అది చాలు అని అంటుంది. సమాజంలో ఇంత ఉదారంగా ఆలోచించే వ్యక్తులు అరుదుగా ఉంటారు. చుక్కమ్మది కల్మషం లేని ప్రేమ, ఆప్యాయత, అనురాగాల కలబోత. ఎంతో ఉన్నతంగా ఆలోచించగలిగే వ్యక్తిత్వం. గ్రామీణ మనస్తత్వం కలిగిన పాత్రే అయినా, చదువు లేకపోయినా సంస్కారవంతంగా ఆలోచించి ఇంటి సమస్యను పరిష్కరించిన మేధావి. ఈ పాత్రను సృష్టించి రచయిత్రి సమాజానికి చక్కటి సందేశాన్నిచ్చారు. డబ్బు, ధనం కంటే బంధుత్వాలు, అనురాగాలు గొప్పవి. అవి ఉన్ననాడు ఇంక దేని అవసరం ఉండదని ఈ పాత్ర రచయిత్రి ద్వారా తెలియజేశారు.

## శశికాంత్ పాత్ర చిత్రణ :

"షాక్ ట్రీట్‌మెంట్" కథలో శశికాంత్ పాత్రను ఆదర్శవంతంగా తీర్చిదిద్దారు రచయిత్రి. శశికాంత్ వృత్తిరీత్యా వైద్యుడు. ఆయన ఒక కార్పొరేట్ హాస్పటల్‌లో వైద్యుడుగా చేరతాడు. వైద్యవృత్తిని అమితంగా అభిమానిస్తాడు కావున వృత్తినే దైవంగా భావిస్తుంటాడు. సమాజంలో డాక్టర్లకు ఉండే గౌరవాభిమానాలు, పూజ్యభావన చూసి అతను ఎంతో సంతోషిస్తాడు. వైద్యుడుగా చేరిన రెండు నెలల తర్వాత ఆ హాస్పటల్‌కు ఒక యాక్సిడెంట్ కేసు వస్తుంది. ఆ వ్యక్తిని చేర్పించడానికి పదహారువేలు కట్టమంటారు రిసెప్షన్ వాళ్ళు. కాని అతడిని అక్కడికి తీసుకొచ్చిన వ్యక్తులు బయటి వాళ్ళు. వారి దగ్గర అంత డబ్బు ఉండదు. ఆ యువకుడు అతని గూర్చి చెప్పే స్థితిలో లేడు. శశికాంత్ అతని పరిస్థితిని చూసి చలించిపోతాడు. పరుగున ఆ హాస్పటల్ ఎమ్.డి. పరమేశ్వరం దగ్గరకు వెళ్ళి విషయం చెబుతాడు. పరమేశ్వరం కుదరదంటాడు. దిగులుగా వస్తున్న శశికాంత్ యాక్సిడెంట్ అయిన వ్యక్తి ఏదో చెప్పాలనుకుంటున్నాడని తెలిసి అతని పెదాల దగ్గరకు తన చెవులను ఆనించి

వింటాడు. కొద్దిగా స్పృహలోకి వచ్చి తన వివరాలు తెలియజేస్తాడు. ఆ యువకుడు తన ఎమ్.డి. పరమేశ్వరం గారి అబ్బాయి అని తెలిసి ఆందోళనతో పరమేశ్వరం దగ్గరకు వెళతాడు. పరమేశ్వరం అతడి ఆందోళన చూసి ఎగతాళి చేస్తాడు. కానీ శశకాంత్ ఆందోళన ఎందుకు చెందుతున్నాడో తెలియజేసే సరికి పరమేశ్వరం కుంగిపోతాడు. వెంటనే ఆపరేషన్ చేయమని ఆదేశిస్తాడు.

పరమేశ్వరంకు శశికాంత్ హితబోధ చేస్తాడు. డబ్బు సంపాదించి అన్నీ వసతులు సమకూర్చుకోవడం కంటే నిస్సహాయులైన రోగుల ప్రాణాలను కాపాడగలిగినప్పుడు కలిగే ఆనందం అపురూపమైనదని అంటాడు. సమాజం వైద్యుడిని సాక్షాత్తు భగవంతుడి స్వరూపంగా భావిస్తుంది. అంటే సమాజం పట్ల వైద్యునికి నైతిక బాధ్యత ఇతరుల కంటే కొంచెం ఎక్కువ అని తెలియజేస్తాడు. డబ్బు కంటే ప్రాణం విలువైనది. ప్రాణాలు పోతే ఎంత డబ్బు పోసినా తిరిగి రాదు. తన చెక్కు బుక్కు తీసి పదహారు వేలకి చెక్కు రాసి పరమేశ్వరం ముందు ఉంచుతాడు. దానితో పాటే అతని రాజీనామా లేఖను కూడా అందిస్తాడు. పరమేశ్వరం శశికాంత్ రాజీనామా లేఖను చూసి అయోమయానికి గురి అవుతాడు. శశికాంత్ అసలు విషయం చెబుతాడు. ఆ వ్యక్తి అతని వివరాలు చెప్పే ప్రయత్నం చేశాడు కాని చెప్పలేకపోయాడు. నేను చిన్న అబద్ధం ఆడి అతని ప్రాణాలు కాపాడటానికి ప్రయత్నించాను. సమకాలీన సమాజంలో వైద్యులు డబ్బు సంపాదనే తమ ధ్యేయంగా రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అటువంటి వైద్యులకు మేలుకొలుపుగా శశికాంత్ పాత్రను తీర్చిదిద్దారు రచయిత్రి.

## రేవతి పాత్ర చిత్రణ :

"ప్రేమతో" కథలో రేవతి పాత్రను ఆదర్శవంతంగా తీర్చిదిద్దారు రచయిత్రి. రేవతి తల్లిదండ్రుల దగ్గర అతిగారాబంగా పెరుగుతుంది. తను ఏదడిగితే అది కాదనుకుండా ఇచ్చేసేవాళ్ళు. ఆమె తండ్రి స్నేహితుడు కొడుకు చైతన్య అంటే తనకిష్టమని చెప్పగానే పెళ్ళి చేస్తారు. ఆస్తి విషయంలో చైతన్య కంటే రేవతి స్థితిమంతురాలు. చైతన్య ఉద్యోగం మానేసి వ్యాపారం పెడతానంటే సరేనని తన వద్ద ఉన్న నగదు ఇస్తుంది. కొంత కాలానికి కొడుకు పుడుతాడు. వ్యాపార వ్యవహారాలలో తలమునకలై ఉన్న చైతన్య పూర్తిగా ఇంటి ధ్యాస మరిచిపోతాడు.

ఆఫీసు గదిలో పనిలో నిమగ్నమై ఉన్న చైతన్య వద్దకు వెళ్ళిన రేవతిని చూసి వినీలా అని పిలుస్తాడు. వినీల ఎవరని అడిగితే తన పి.ఎ. అని చెబుతాడు. ఆఫీసు పనుల్లో చక్కగా సహాయం చేస్తుంది. చురుకుదనం, తెలివితేటలు ఉన్న అమ్మాయి నాలుగు నెలల్లో పూర్తి చేసే పనిని ఒక్క నెలలోనే పూర్తి చేస్తుంది అంటాడు. వినీల గురించి మాట్లాడుతున్నప్పుడు చైతన్య కళ్ళలోని మెరుపును గమనిస్తుంది రేవతి. ఆ తర్వాత తరచుగా ఆఫీసుకు వెళ్ళి వినీలను గమనిస్తుంది. వ్యక్తిత్వం, విలువలు ఉన్న అమ్మాయి అని తెలుసుకుంటుంది. చైతన్యలోని మార్పును గమనించింది. ఎప్పుడూ నిరాసక్తంగా, యంత్రికంగా ఉంటున్నాడని తెలుసుకుంటుంది. వినీల ఆకర్షణకు, వైవాహిక బంధానికి మధ్య నలిగిపోతున్నాడని గ్రహిస్తుంది. చైతన్యతో చిన్న చిన్న విషయాలకు గొడవ పెట్టుకున్నట్లు నటించి విడాకులు తీసుకుంటుంది. వినీలకు, చైతన్యలను కలపడం కోసం గొప్ప త్యాగమే చేస్తుంది.

తన భర్త మనసులో వేరొకరికి స్థానం ఉందని గ్రహించి సంసార జీవితాన్ని వదిలేసి, ఒంటరి జీవితంలోనికి ప్రవేశిస్తుంది. కాని చైతన్యపట్ల ప్రేమ అలాగే ఉంటుంది. అందుకే మళ్ళీ పెళ్ళి చేసుకోకుండా ఉండిపోతుంది. కొడుకును కూడా చైతన్య వద్దనే వదిలేస్తుంది. తన వద్ద ఉంటే కేవలం తల్లి ప్రేమ మాత్రమే దొరుకుతుంది. అదే చైతన్య వద్ద ఉంటే తల్లి, దండ్రుల ప్రేమ దొరుకుతుందని భావించి అల్లారు ముద్దుగా తన కొడుకు పెరగాలనే ఉద్ధేశ్యంతో వినీల, చైతన్యల వద్దనే వదిలేస్తుంది. కొడుకును వదిలి ఉండడానికి ఆమె మనసును కట్టడి చేస్తుంది. అనాధ శరణాలయం నుండి ఒక పాపను తెచ్చుకుని పెంచుతుంది. కొంతమంది పిల్లల ఆలనాపాలనా ఖర్చులను భరించే విధంగా దత్తత తీసుకుంటుంది. దూరం నుంచే తన కొడుకు ఎదుగుదలను గమనిస్తూ సంతృప్తి పడుతుంది.

వినీల ఒడిలో తల్లి ప్రేమను పొందుతూ పెరుగుతున్న పసివాడికి కనిపించి అనవసరమైన కలవరం కలిగించటమెందుకని కథనాత్మురాలిగా మారుతుంది. ఒకరి భావాలు వేరొకరికి నచ్చక విడాకులు తీసుకుంటారు గాని, ప్రేమిస్తూనే విడాకులిచ్చిన రేవతి పాత్ర చిత్రంగా తోస్తుంది. భర్త మనసును అర్థం చేసుకుని భర్త సుఖం కోసం కఠిన నిర్ణయం తీసుకున్న భార్యగా రేవతి పాత్రను రచయిత్రి తీర్చిదిద్దిన తీరు అమోఘం. కథాంతంలో రేవతి గొప్పతనాన్ని తెలుసుకున్న తన భర్త చైతన్య, కొడుకు మహీ మరియు వినీలలు పశ్చాత్తాపపడతారు. స్త్రీల యొక్క విశాలమైన హృదయం ఔదార్యం ఈ పాత్ర ద్వారా రచయిత్రి తెలియజేసారు.

## రామయ్య పాత్ర చిత్రణ :

"వారసుడు" కథలో ఆదర్శవంతమైన పాత్ర రామయ్య. పిల్లలు లేని రామయ్యకి తన వ్యవహారాలన్నింటినీ సమర్థంగా నిర్వహించగలిగే ఒకరిని దత్తత తీసుకోవాలనే ఆలోచన వస్తుంది. రామయ్య భార్య పెళ్ళయిన రెండు సంవత్సరాలకే చనిపోతుంది. రామయ్య మళ్ళీ పెళ్ళి చేసుకోడు. ఎన్నో సేవాసంస్థల్ని నడిపిస్తుంటాడు. రామయ్య తమ్ముడు గోపాలరావు. అతనికి ముగ్గురు కొడుకులు. సత్యమూర్తి, శివరావు, సుందరం. వీరి ముగ్గురిలో ఒకరిని దత్తత తీసుకోవాలని భావించి తన ఊరు రమ్మంటాడు.

గ్రామంలో ప్రవేశించిన తమ్ముడి కొడుకులు మార్గమధ్యలో ఆ ఊరి వ్యక్తిని రామయ్యగారి ఇల్లు ఎక్కడ అని అడుగుతారు. అందుకు సమాధానంగా దేముడు రామయ్యగారి ఇల్లు అని బదులిచ్చి తాను తీసుకెళతాను అని సూట్‌కేసులు అందుకోబోతే అతడిని వారించి ముందుకు నడుస్తారు. ఆ ఊరిలో రామయ్యకు ఎంత గౌరవం ఉందో అని భావిస్తారు. మరికొంచెం దూరం నడిచి ఇంకొకరిని అడుగుతారు. అతను పిచ్చి రామయ్య గారింటికి వచ్చారా! ఎదురు వీధిలోని రెండో ఇల్లే అని సమాధానం ఇస్తాడు. సోదరుల ముగ్గురూ ఆశ్చర్యపోతారు. రామయ్యను ఒకడు దేముడు రామయ్య అంటే మరొకడు పిచ్చి రామయ్య అంటున్నాడేమిటి అని సందేహం కలుగుతుంది. రామయ్య తన ధనాన్ని లేని వాళ్ల కోసం ఖర్చు చేస్తున్నారని ఊరవతల జనం దేముండంటారు. గ్రామంలో కొందరు మొత్తం వెనకాముందూ ఆలోచించకుండా ఖర్చు చేసేస్తున్నాడని పిచ్చి రామయ్య అని పేరు పెట్టారని తెలుసుకుంటారు.

రామయ్య ముగ్గురిని ఆప్యాయంగా ఆహ్వానించి భోజన సదుపాయాలను కల్పించి విశ్రాంతి తీసుకోమంటాడు. మరునాడు ముగ్గుర్ని వెంటబెట్టుకొని వెళ్ళి తన తోటలు, పరిశ్రమలను చూపిస్తాడు. తన నిర్వహిస్తున్న హాస్పటల్, స్కూలు, అనాథశ్రమం లాంటి సేవాసంస్థల్ని చూపిస్తాడు. తన తాత చేసిన తమాషా ఆస్తి పంపకం గురించి తమ్ముడి కొడుకులకు వివరిస్తాడు. రామయ్య గోపాలరావుల తండ్రి చనిపోతే తమ్ముళ్ళిద్దరూ తాత దగ్గరే పెరిగి పెద్ద వారవుతారు. ఆయన అవసాన దశలో ఇద్దరిని కూర్చోబెట్టి తను సేకరించిన విలువైన గ్రంథాలున్న పెంకుటిల్లు ఒక భాగంగానూ, తనకున్న పదెకరాల మాగాణిని ఇంకొక భాగంగానూ పంచుతున్నానని ఎవరికి ఏది కావాలో నిర్ణయించుకోమంటాడు. రామయ్య ప్రాచీన గ్రంథాలున్న పెంకుటిల్లును తీసుకుంటాడు. గోపాలరావు పదెకరాల మాగాణిని తీసుకుంటాడు.

రామయ్య ఈ కథ చెబుతుంటే ఇంతలో అతని స్నేహితుడు రంగారావు ఒక డబ్బు సంచిని తెచ్చి దాచమంటాడు. అది తమ్ముడి కొడుకుల్లో ఒకరికి ఇచ్చి ఇనప్పెట్టెలో ఉంచమని చెబుతాడు రామయ్య. మరునాడు ఉదయమే రంగారావు చనిపోయిన వార్త తెలుస్తుంది. తన ఇంట్లో డబ్బును దాచిన సంగతి ఎవరికి తెలియదని రామయ్య తమ్ముడి కొడుకులతో అంటాడు. ఆ డబ్బును మనమే ఉంచుకుందాం. ఎవ్వరితో ఈ విషయం గురించి చెప్పకండి అని అంటాడు. పెదనాన్న మాటలకు సత్యమూర్తి, శివరావులు సమాధానపడి తలలూపారు. సుందరం మాత్రం అంగీకరించడు.

రామయ్యకు కోపం వచ్చినట్లు నటించి ఇక్కడి నుండి వెంటనే బయలుదేరి వెళ్ళండి అని గదిలోకి వెళ్ళిపోతాడు. సత్యమూర్తి, శివరావులు ఇద్దరూ సుందరంను నిందిస్తారు. తనవల్లే కోటీశ్వరులమయ్యే అవకాశం కోల్పోయామని అంటారు. కానీ సుందరంనకు పెదనాన్న రామయ్య ప్రవర్తన చూసి ఆశ్చర్యపోతాడు. సేవాసంస్థల్ని నడుపుతున్న పెదనాన్న పరాయిసొమ్మును ఆశించడం అతనికి బాధ కలిగిస్తుంది. వారితో బస్టాండ్ వరకు వచ్చిన రామయ్య బంట్రోతు వీరన్న ఒక ఉత్తరంను సోదరుల చేతికిచ్చి అయ్యగారు ఇమ్మన్నారని చెప్పి వెళ్ళిపోతాడు.

ఆ ఉత్తరంను తీసి చదివి ఆశ్చర్యపోతారు. తాత ఆస్తి పంపకాల్లో గ్రంథాలయాన్ని తీసుకున్నాను. ఆ పుస్తకాల్లో ఒక పర్సులో విలువైన వజ్రాలు ఉన్నాయి. పుస్తకాలను ప్రేమించే వాళ్ళ మనసు కూడా విశాలంగా ఉంటుంది. కావున నీకు తాతయ్య ఇచ్చిన కానుక అని చీటిలో రాసిఉంది. ఆ వజ్రాలతో వ్యాపారం చేసి బాగా సంపాదించాను. ఆ సంపాదనను ఇతరులకు వినియోగించాలనుకున్నాను. ఆస్తి వ్యవహారాలను చూసుకోవటానికి సరైన వారసుడిని ఎంపిక చేయడం కోసమే నా స్నేహితుడు రంగారావు చేత ఈ నాటకం ఆడించాను. ఆ నాటకంలో సుందరం గెలిచాడు. ధన ప్రలోభానికి లొంగకుండా నిలబడగలగటం చాలా కష్టం. ఎంత స్థిరచిత్తం కలిగిన వారికైనా తుఫాను గాలిలా ఊగిసలాటకు గురి చేస్తుంది. అందుకే కుటుంబ సభ్యుల ఒత్తిడికి గాని, ధన ప్రలోభానికి గాని లొంగని దృఢమైన మనసు ఉన్న వారిని ఎంపిక చేయటానికి మీ ముగ్గురికి చిన్న పరీక్ష పెట్టాను అని అందులో రాసి ఉంటుంది.

రామయ్య ఆశలకు, ఆశయాలకు అనుగుణంగా ఉండే సుందరాన్ని దత్తత తీసుకుని తన ఆస్తి వ్యవహారాలను సేవాసంస్థల నిర్వహణ బాధ్యతను ఇవ్వాలని నిర్ణయించుకుంటాడు. సమకాలీన సమాజంలోని బంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగానే ఉన్నాయి. అటువంటి

సమాజంలో మార్పును తీసుకురావడం కోసం రచయిత్రి రామయ్య పాత్రను సృష్టించినట్లు తెలుస్తుంది.

## కేశవరావు పాత్ర చిత్రణ :

"పుడమి పులకించింది" కథలో ఆదర్శపాత్ర కేశవరావు. కేశవరావు ఇంజినీరింగ్ చదివినా గానీ హైస్కూల్ టీచరుగా పని చేస్తుంటాడు. పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ మంచి పేరు తెచ్చుకుంటాడు. అతని స్కూలు పిల్లలకు ఖాళీసమయాల్లో నీతి కథలను చెబుతూ వారిలో చైతన్యం కలిగిస్తుంటాడు. ఒకనాడు పనిమీద వేరే ఊరు వెళ్ళవలసి వస్తుంది. అక్కడి నుండి తిరుగు ప్రయాణం అయ్యేటప్పుడు మార్గమధ్యలో అతని స్నేహితుడు కన్పిస్తాడు. స్నేహితుడు ఆప్యాయంగా ఆ రోజుకు తన దగ్గరే ఉండమని చెబితే కాదనలేక ఒప్పుకుంటాడు. స్నేహితుడితో పాటు అతని స్నేహితుడు పని చేస్తున్న పాఠశాలకు వెళతాడు. అక్కడి విద్యార్థులకు నూతన కథ ద్వారా చైతన్యపరుస్తాడు.

కథల వలన ప్రయోజనం ఏమిటని స్నేహితుడిని అడిగిన ప్రశ్నకు సమాధానంగా మంచి కథ వ్యక్తిత్వ నిర్మాణానికి దోహదపడుతుంది. వీలైనప్పుడల్లా పిల్లలకు తల్లిదండ్రులు, గురువులు మంచి కథలు చెబుతుండాలి. కథల వలన మనుషులు మహాత్ములుగా మారకపోయినా మంచి మనిషిగా బ్రతికితే చాలు అని అంటాడు. అప్పుడు ఆ సమాజం కూడా బాగుపడుతుంది. ఒక మంచి కథ పదునైన ఆయుధంలా మనసులోని మధనాన్ని సృష్టిస్తుంది. ఆలోచనల్ని రేకెత్తిస్తుంది. మంచి మార్గాన్ని చూపిస్తుంది. తడి నేలలో నాటిన విత్తనం మొలకెత్తినట్లుగా ఆర్ద్రంగా ఉండే పిల్లల మనసుల్లో హత్తుకునేట్లుగా నైతక విలువల్ని ప్రభోధించే మంచి కథల్ని చెప్పటం వలన కొంతమందిలో అయినా కొంతవరకయినా ప్రయోజనం ఉంటుందని కేశవరావు అభిప్రాయం. నైతిక విలువలను నేర్చుకున్న పిల్లలు పెద్దవారయ్యాక మనస్సాక్షిని చంపుకుని చెడ్డ పనులు చేయడానికి సాహసించరు అంటాడు.

పిల్లలకు కథను చెప్పటం ప్రారంభిస్తాడు. ఇద్దరు సోదరులు అన్యోన్యంగా ఉంటారు. వారి పేర్లు సూర్యం, చంద్రశేఖరం. ఉద్యోగానికి వెళ్ళిన సూర్యం చీకటి పడినా రాకపోయేసరికి చంద్రశేఖరం వెతకడానికి వెళతాడు. సగం దారిలో అతనికి ఒక భయానక దృశ్యం కన్పిస్తుంది. ఒక జీపుపక్కన నలుగురైదుగురు వ్యక్తులు నిర్జీవంగా పడి ఉంటారు. వాళ్ళెవరూ తమ ఊరివాళ్ళు కాదు. ఏం జరిగిందో ఏమిటో తెలియక నిశ్చేష్టుడై నిలబడిపోయిన అతనికి కొంచెం దూరం నుండి మాట వినిపించేసరికి అటువైపుకి అడుగులు వేశాడు. కొనప్రాణంతో కొట్టుమిట్టాడుతున్న నేల మీద పడి ఉన్న వ్యక్తి అతని అన్న.

అన్న తలను ఒడి మీద పెట్టుకుని ఏం జరిగిందని అడుగుతాడు. బస్సు కోసం వేచి చూస్తున్న సూర్యానికి అతని స్నేహితుడు నాగేంద్ర చూసి మీ ఊరి మీదుగా వెళ్తున్నానని చెప్పి జీపు ఎక్కించుకున్నట్లు చెబుతాడు. నాగేంద్ర శత్రువు భూపతిరావు అడ్డగించి నాగేంద్రతో పాటు అతని అనుచరులను వారితో పాటు తనని కూడా నరికేశారని చెబుతాడు. ఆ గొడవలతో తనకి సంబంధం లేదని ప్రాధేయపడినా వినిపించుకోలేదని చెబుతాడు. అలా చెబుతూనే తుది శ్వాస విడుస్తాడు. తన అన్నని చంపిన భూపతిరావు మీద చంద్రశేఖరం కక్ష పెంచుకుంటాడు. అతని కొడుకు ప్రశాంత్‌కు ట్యూషన్ చెప్పటానికి అతని ఇంట్లో చేరతాడు. అవకాశం కోసం ఎదురు చూస్తుంటాడు. ప్రశాంత్‌కు చంద్రశేఖరం తన జీవిత కథనే కథగా చెబుతాడు.

ప్రశాంత్ అది జరిగిన కథేనని తెలుసుకుంటాడు. తన తండ్రిని చంపడానికి మాష్టారు వేషంలో చంద్రశేఖరం వచ్చాడని తెలుసుకుంటాడు. చంద్రశేఖరం కళ్ళలో బాధను గమనించి ప్రశాంత్ తన తండ్రే హంతకుడని అర్థం చేసుకుంటాడు. ప్రశాంత్ పగ నిప్పులాంటిదని, ప్రేమ అమృతంతో సమానమని చంద్రశేఖర్‌తో చెబుతాడు. ఒకరినొకరు చంపుకుంటూ పోతే కొన్నాళ్ళకు ఈ భూమి శ్మశానమవుతుంది అని అంటాడు. నైతిక విలువల్ని పెంచే, మంచి ఆలోచనల్ని కలిగించే కథల్ని పిల్లలకు ఉపాధ్యాయులు చెప్పాలి. నేర రహితమైన నందనవనం లాంటి సమాజ స్థాపనకూ ఇది ఒక మంచి మార్గమని చెబుతాడు.

ప్రశాంత్ మాటలు విన్న చంద్రశేఖరం మనసులో మార్పు వస్తుంది. తాను భూపతిరావును చంపడానికి వచ్చిన విషయాన్ని భూపతిరావుతో చెబుతాడు. తన తల్లి ఇంటి వద్ద ఉంది ఆమెను చంపి వచ్చిన తర్వాత మీరు నన్ను చంపండి అంటాడు. తాను లేకుండా తల్లి ఒంటరిగా బ్రతకలేదు అంటాడు. జరిగిన విషయం తెలుసుకున్న భూపతిరావులో మార్పు వస్తుంది. అనవసరంగా అమాయకుడైన సూర్యాన్ని చంపానని తెలుసుకొని పశ్చాత్తాపపడతాడు. ఆ రోజు నుండి తన ఆస్తులను సేవాకార్యక్రమాలకు వినియోగిస్తాడు అని కథను ముగిస్తాడు. చంపటంలో కాదు, ప్రేమని పంచటంలోనే హీరోయిజం ఉందని పిల్లలచేత చెప్పిస్తాడు కేశవరావు. కేశవరావు లాంటి ఆదర్శ భావాలు గల ఉపాధ్యాయులు ఉన్నవాడు. భవిష్యత్తులో నైతిక విలువలకు కొదవలేని సమాజంను సృష్టించవచ్చు. ఇటువంటి సందేశాత్మక పాత్రల వలన పాఠకునిలో చైతన్యం కలుగుతుంది.